


ఆంధ్రజ్యోతి





# సర్వే సంబరాలు

## మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ టీడీపీ-జనసేన-బీజేపీ వైపే మొగ్గు

దేశవ్యాప్తంగా పోలింగ్ ముగిసిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా ఓటర్ల నాడిని ప్రతిబింబించే విధంగా ఎగ్జిట్‌పోల్స్ కుప్పలు తెప్పలుగా వెలువడ్డాయి. అత్యధిక సర్వే సంస్థలు తెలుగుదేశం, జనసేన, బీజేపీతో కూడిన కూటమికి అనుకూలంగా ఫలితాలు వెలువరించాయి. అసెంబ్లీ, ఎంపీ స్థానాలు రెండింటిలోనూ కూటమి పైచేయి సాధించబోతున్నట్టు తమ సర్వే ఫలితాలను ఈ సంస్థలు బహిర్గతం చేశాయి. ఇంకోవైపు వైసీపీ స్వల్ప మెజారిటీతో గట్టు ఎక్కడం ఖాయమంటూ మరికొన్ని సర్వే సంస్థలు ఫలితాలు ప్రకటించాయి. దీంతో ఇప్పటికే తీవ్ర ఉత్కంఠతతో ఉన్న వివిధ పార్టీల అభిమానులంతా ఎవరికి వారు సంబరాలు చేసుకున్నారు. తాము ఊహించినట్లుగానే కూటమి దూసుకెళ్లడం ఖాయమని కొందరు నేతలు, పోటీ చేసిన అభ్యర్థులు ఓ అంచనాకు వచ్చేసినట్టు అయింది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వాస్తవానికి దేశవ్యాప్తంగా జరిగిన పార్లమెంట్, వివిధ రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియ ఆసాంతం శనివారం సాయంత్రంతో ముగిసింది. ఆ ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ బహిర్గతం అయ్యాయి. రోజంతా ఈ పోల్స్‌లో ఎటువంటి ఫలితాలు ఎవరి వైపు మొగ్గు చూపుతాయోనన్న ఉత్కంఠతోనే అంతా ఆసక్తిని కనబరిచారు. ఇందుకు తగ్గట్లుగానే తమ నియోజకవర్గాల్లో పోలింగ్ నుంచి ఇప్పటి వరకు తమకు ఉన్న అంచనాలను తాజా సర్వే ఫలితాలతో బేరీజు వేసుకున్నారు. మెజారిటీ సంస్థలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో

### క్లీన్ స్వీప్ దిశగా పశ్చిమ

### 4న ఓట్ల లెక్కింపు.. కౌంట్‌డౌన్ మొదలు




ఆంధ్రప్రదేశ్ ఎగ్జిట్ పోల్ 2024 — మొత్తం సీట్లు: 175

| [illegible] | టీడీపీ+ | వైఎస్ఆర్‌సీపీ | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|
| [illegible] | 114-125 | 39-49 | 0 | 1 |
| [illegible] | 111-135 | 45-60 | 0 | 0 |
| [illegible] | 144 | 31 | 0 | 0 |
| [illegible] | 98 | 73 | 1 | 3 |
| [illegible] | 121-129 | 45-54 | 0 | 0 |
| [illegible] | 93 (+/-8) | 82 (+/-8) | 0 | 0 |
| [illegible] | 67-75 | 95-103 | 0 | 0 |
| WRAP Survey | 4-17 | 158 | 0 | 0 |
| [illegible] | 71-81 | 94-104 | 0 | 0 |
| [illegible] | 113-122 | 48-60 | 0 | 0 |
| [illegible] | 161 | 14 | 0 | 0 |

కూటమి విజయం ఖాయమంటూ వివిధ సర్వే సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు

వున్న 15 అసెంబ్లీ స్థానాలకు గాను 13 నుంచి 15 సీట్లు కూటమికి వస్తాయంటూ అంచనావేశాయి. దీంతో భీమవరం కేంద్రంగా ఏర్పాటైన పశ్చిమలో ఏడు స్థానాలు కూటమి కైవసం చేసుకుం టుందని తేల్చి చెప్పాయి. వైసీపీకి అనుకూలంగా చెప్పిన ఆరా సంస్థ జిల్లాలో ఇద్దరు మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావులకు ఓటమి తప్పదని తేల్చింది. ఉండిలో రఘురామకృష్ణంరాజు విజయం సాధిస్తారని ఆరా సంస్థ స్పష్టం చేసింది. అయితే ఇక సీ ఓటర్స్, పయనీర్, పీపుల్స్ పల్స్ వంటి సంస్థలు కూటమికే పట్టం కట్టాయి. దీంతో జిల్లాలో నర్సాపురం పార్లమెంట్‌తో సహా ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ కూటమి విజయం సాధిస్తుందన్న నమ్మకం పెరిగింది. కూటమిలో జోష్ నెలకొంది. ఏడుగురు అభ్యర్థులు విజయం సాధించే అవకాశం ఉందంటూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

#### పందేలపై వైసీపీ పరార్

సాధారణంగా ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలైన తర్వాత పందేలు జోరందుకుంటాయి. కానీ, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందంటూ ప్రముఖ సంస్థలు తేల్చేయడంతో వైసీపీ శ్రేణులు పరారయ్యారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ సీట్లలో ఒక్కటి నెగ్గే అవకాశం లేదంటూ వైసీపీ శ్రేణులు గుబులు చెందుతున్నాయి. వాస్తవానికి ఆచంట, ఉండి, భీమవరంలో విజయం సాధిస్తామంటూ వైసీపీ లెక్కలు వేసుకుంది. అయినా సరే మూడుచోట్ల కోసు పందేలు సాగాయి. కూటమి వైపే అంతా మొగ్గు చూపారు. కూటమికి అనుకూలంగా పందేలు కాశారు. టీడీపీ సానుభూతిపరులు పందేలకు కాలు దువ్వుతున్నా సరే వైసీపీ నాయకులు, కార్యకర్తలు వెనుకంజ వేస్తున్నారు.

#### ప్రముఖులకు పరాభవమేనా ?

వైసీపీలో జిల్లాలో నేతలంతా కీలక పదవులను అనుభవించారు. ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ రంగనాధరాజు మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు జిల్లా అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు మంత్రులుగా కొనసాగుతున్నారు. నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద్‌రాజు ప్రభుత్వ చీఫ్ విప్‌గా, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ విప్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజా ఎగ్జిట్ పోల్స్ ప్రకారం వీరందరికి ఓటమి తప్పదంటూ అంచనాలు వేసుకుంటున్నారు. నర్సాపురం లోక్‌సభ స్థానంలోనూ కూటమి అభ్యర్థి భారీ ఆధిక్యతతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా మరో రెండు రోజుల్లో నిజమైన ఫలితాలు వెల్లడి కానున్నాయి. అయితే కొన్ని సంస్థలు వైసీపీకి అనుకూలంగా ఫలితాలు ఇచ్చినట్లు ఆ పార్టీ శ్రేణుల్లోనూ ఒకింత ఆశలు నెలకొన్నాయి.

#### • రెండు రోజుల్లో లెక్కింపు


రాబోయే రెండు రోజుల్లోనే ఓట్ల లెక్కింపు జరగనుంది. దీనికి అనుగుణంగానే అన్ని పార్టీలు మానసికంగా సిద్ధపడ్డాయి. భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఆచంట, తణుకు, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలకు, ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో భీమవరం, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇందుకోసం ముమ్మర ఏర్పాట్లు పూర్తిచేశారు. సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. నిబంధనలను అతిక్రమించవద్దంటూ రాజకీయ పార్టీ నేతలకు అవగాహన కల్పించారు. ఎన్నికల అనంతరం రెండు రోజులపాటు ఎటువంటి సంబరాలు చేసుకోకూడదంటూ అధికారులు ఆదేశాలు జారీ చేసారు. సున్నితమైన ప్రాంతాలను గుర్తించారు. అటువంటి ప్రాంతాలలో మూడు రోజులపాటు షాపులు తెరవద్దంటూ దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో దువ్వతోపాటు మరికొన్నింటిని సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు. రాజకీయ పార్టీలు సైతం తమ ఏజెంట్లకు ఈవీఎం మిషన్ల ఓట్ల లెక్కింపుపై అవగాహన కలిగించారు. మొత్తంగా మరో రెండు రోజులపాటు ఫలితాలకు ఎదురుచూడాలి. అప్పటి వరకు ఉత్కంఠ తప్పదు.

• జయ హనుమాను.. జ్ఞాన గుణసాగర



## మద్దిలో ప్రత్యేక పూజలు

బుట్టాయగూడెం(జంగారెడ్డిగూడెం), జూన్ 1 : మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోడానికి ఉదయం నుంచే భక్తులు వేలాదిగా తరలివచ్చి బారులు తీరారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రభాత సేవ, నిత్యార్చన, నిత్య హోమం, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములు, ప్రసాద వితరణ నిర్వహించారు. లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలను జరిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. పది వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపినట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్రారెడ్డి, సీఐ రమేష్, లక్కవరం ఎస్సై ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. జయంతి సహిత కల్యాణ మహోత్సవాలు జూన్ నాలుగో తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.



హనుమాన్ జయంతి సందర్భంగా పాలకొల్లులోని దాసాంజనేయస్వామిని ఛత్రపతి శివాజీ వేషధారణలో అలకరించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించి పూజలు చేశారు.

## ఇంటింటా జల్లెడ

- ఎన్నికల కౌంటింగ్‌తో కార్డన్ సెర్చ్‌లు
- రికార్డులు లేని బైక్‌లు స్వాధీనం
- లబోదిబోమంటున్న వాహనదారులు
- మామూళ్ల మత్తులో సిబ్బంది !
- పాలాల్లో దాచుకుంటున్న వాహనాలు



7



## జిల్లాలో హై అలర్ట్

- ఎస్పీ వి.అజిత.. భీమవరంలో ఫ్లాగ్‌మార్చ్

భీమవరం క్రైం, జూన్ 1 : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వి.అజిత అన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజున, తదనంతరం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భీమవరంలో జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు సంయుక్తంగా పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగంతో కలిసి కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా బందోబస్తు చర్యలు చేపట్టామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ సిబ్బందితో సహకరించి ప్రక్రియ సాఫీగా జరిగేలా కృషి చేయాలన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరూ గుంపులుగా గుమిగూడి ఉండరాదన్నారు. కౌంటింగ్ జరిగే జూన్ 4న జిల్లా అంతటా హైఅలెర్ట్ ప్రకటించామన్నారు. రౌడీ షీటర్లు, కిరాయి హంతకులు, ట్రబుల్ మాంగర్స్, హిస్టరీ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

## డెల్టా కాల్వలకు సాగు నీటి విడుదల

ధవళేశ్వరం/నిడదవోలు, జూన్ 1 : గోదావరి డెల్టా పరిధిలోని మూడు ప్రధాన పంట కాల్వలకు శనివారం సాగు నీటిని విడుదల చేశారు. ధవళేశ్వరం తూర్పు డెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద తూర్పు గోదావరి కలెక్టర్ మాధవీలత, విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద శనివారం పశ్చిమ డెల్టా కాల్వలకు నీటిపారుదల శాఖ ఈఈ ఎం.దక్షిణామూర్తి పూజలు నిర్వహించి స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. గోదావరి మాతకు పసుపు, కుంకుమ, చీర, గాజులు, పూలు సమర్పించి హారతులు ఇచ్చారు. బ్యారేజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరించారు. ఈ సందర్భంగా దక్షిణామూర్తి మాట్లాడుతూ మొదటిరోజు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, తర్వాత అవసరానికి తగినట్టు పెంచుతామన్నారు. పశ్చిమ డెల్టా పరిధిలోని రైతాంగం సార్వాను త్వరగా ప్రారంభించుకోవడం ద్వారా దాళ్వా కూడా త్వరగా ప్రారంభం అవుతుందన్నారు. గోదావరి డెల్టా సీఈ ఆర్.సతీష్‌కుమార్, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, హెడ్ వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, శెట్టిపేట జేఈ కిరణ్‌కుమార్, నీటి పారుదలశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కార్యక్రమంలో రాజకీయ నాయకులు పాల్గొనలేదు.





విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఈఈ దక్షిణామూర్తి.. కాల్వలోకి నీరు..

## వైసీపీకి ఓటమి భయం : పితాని



పెనుమంట్ర, జూన్ 1 : ఓటమి భయంతోనే వైసీపీ కౌంటింగ్‌లో గందరగోళం సృష్టించాలని సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మండిపడ్డారు. శనివారం మార్టేరు శ్రీ వేణుగోపాలస్వామి ఆడిటోరియంలో ఆచంట నియోజకవర్గ కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. లీగల్ అడ్వైజర్ షరీఫ్, నక్క శర్మ కౌంటింగ్‌లో ఎదురయ్యే పరిణామాలను నివృత్తి చేశారు. పితాని మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభంజనం వీస్తుందన్నారు. ఆచంటలో 13 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుందని ప్రతి రౌండ్‌లోను ఈవీఎంలు ఫారం ప్రకారం ఓట్లు సరిపోయినవి, లేనిది చూసుకోవాలన్నారు. ఏవైనా తేడాలుంటే వెంటనే కౌంటింగ్ ఏజెంట్లు లీగల్ సెల్ ప్రతినిధులకు తెలియపరిస్తే ఆర్వోకు ఫిర్యాదు చేస్తారన్నారు.

## డిగ్రీ ప్రవేశాలకు 19న నోటిఫికేషన్

- ఈసారైనా సీట్ల భర్తీ ఆశించిన స్థాయిలో ఉంటుందా ?



భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 1: డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ తేదీ ఖరారైంది. గడిచిన రెండేళ్ల మాదిరి కాకుండా ఈసారైనా సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యి పూర్వ వైభవం వస్తుందా ? అని కళాశాలల యాజమాన్యా లు ఎదురు చూస్తున్నాయి. వైసీపీ అస్తవ్యస్త పాలనతో విద్యా రంగం పూర్తిగా గాడి తప్పింది. దీని ప్రభావం డిగ్రీపైన పడింది. గడిచిన రెండేళ్లుగా పరిశీలిస్తే డిగ్రీ సీట్ల భర్తీ ఆశించిన స్థాయిలో జరగలేదు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 233 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. 2021-22 విద్యా సంవత్సరంలో 43,500 సీట్లు భర్తీ కాగా, 2022-23 నాటికి అది 27,500కు పడిపోయింది. అంటే దాదాపు 16 వేల సీట్లు తగ్గిపోయాయి. 2023-24 లోను పరిస్థితి ఏమంత మెరుగుపడలేదు. ఈ విద్యా సంవత్సరంలోనైనా కాస్త మెరుగు పడుతుందని కళాశాలల యాజమాన్యాలు ఆశాభావంగా ఎదురు చూస్తున్నాయి. ఇంటర్ ఫలితాలు విడుదలై 50 రోజులైంది. ఉత్తీర్ణత శాతం బాగుంది. ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ ఈ నెల 18న విడుదల చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. 19 నుంచి 24 వరకు రిజిస్ట్రేషన్‌లు, 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు, జూలై 3న సీట్ల కేటాయింపు జరపనుంది. 4 నుంచి విద్యార్థులు కళాశాలల్లో చేరాల్సి వుంటుంది. స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్ జూన్ 21 నుంచి 23 వరకు ఉంటుంది.



## పట్టణాలకు అమృత్ నిధులు

- భీమవరంలో నాలుగు రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- తాడేపల్లిగూడెం, తణుకు, ఆకివీడు, నరసాపురాలకి మంజూరు

భీమవరం టౌన్, జూన్ 1 : భీమవరం పట్టణానికి మరో నాలుగు రిజర్వాయర్ల నిర్మాణంతోపాటు, పైపులైన్‌ల ఏర్పాటుకు అమృత్-2లో రూ.47.29 కోట్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు ప్రజారోగ్య శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. నివేదికలు రాగానే సాంకేతిక అనుమతుల కోసం ఉన్నతాధికారులకు పంపనున్నారు. ఈ నిధులతో పట్టణంలోని మారుతీనగర్, బుధవారం మార్కెట్, హౌసింగ్ బోర్డు కాలనీ, వంశీకృష్ణనగర్‌లో రిజర్వాయర్లు నిర్మిస్తారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున, కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత పనులు వేగవంతంగా ప్రారంభించేలా చర్యలు ఉంటాయి. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో 24 గంటల నీటి సరఫరాకు కొన్ని ప్రాంతాలను ఎంపిక చేయనున్నారు. గతంలోనే ఈ ప్రతిపాదన వచ్చినా అమలు కాలేదు. ఇప్పుడు మళ్లీ అమలు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే ఆకివీడు నగర పంచాయతీకి మంజూరైన రూ.28.60 కోట్లతో రిజర్వాయర్లు, పైపులైన్, ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సాంకేతిక అనుమతి కోసం ఉన్నతాధికారులకు పంపించారు. అనుమతులు రాగానే టెండర్లు పిలుస్తామని అధికారులు చెబుతున్నారు. తాడేపల్లిగూడెంలో సమ్మర్ స్టోరేజ్ పనులకు టెండర్లు పూర్తవడంతో పనులు చేపట్టారు. భీమవరం గునుపూడి లే-అవుట్‌లో రూ.13.39 కోట్లతో పైపులైన్లు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. తణుకుకు రూ.8.36 కోట్లు, నరసాపురానికి రూ.21 కోట్లు మంజూరయ్యాయి.

## 4న భీమవరంలో ట్రాఫిక్ మళ్లింపు

భీమవరం క్రైం, జూన్ 1 : భీమవరం విష్ణు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీల్లో నాలుగో తేదీ మంగళవారం ఓట్ల లెక్కింపు సందర్భంగా పట్టణంలో ఉదయం ఆరు గంటల నుంచి ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు జిల్లా ఎస్పీ వి.అజిత తెలిపారు.

- విజయవాడ, గుడివాడ వైపు నుంచి వచ్చే అన్ని రకాల వాహనాలు కాళ్ళ మండలం పెదఅమిరం పుంత రోడ్ మీదుగా, ఉండి రోడ్ చేరుకుని భీమవరం పట్టణంలోకి ప్రవేశించాలి.
- భీమవరం పట్టణం నుంచి వచ్చే కార్లు, బైక్‌లు వంటి చిన్న వాహనాలు సర్ ఆర్థర్ కాటన్ పార్క్ (జువ్వలపాలెం రోడ్) వద్ద డైవర్షన్ తీసుకుని చిన అమిరం మీదుగా కోపల్లె హైస్కూల్ వద్ద కాళ్ల రోడ్ ఎక్కి గుడివాడ, విజయవాడ వెళ్లవచ్చు.
- పాలకొల్లు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు బొంబాయి స్వీట్స్ వద్ద ఉండి రోడ్డుకు వచ్చి మల్టీప్లెక్స్ మీదుగా ఉండి, ఆకివీడు, కైకలూరు, విజయవాడ, గణపవరం, ఏలూరుకు.., పెదఅమిరం పుంత రోడ్ నుంచి కాళ్ళ, గుడివాడ, విజయవాడకు వెళ్లవచ్చు.
- తాడేపల్లిగూడెం నుంచి వచ్చే అన్ని రకాల వాహనాలు గొల్లలకోడేరు వంతెన వద్ద డైవర్షన్ తీసుకుని పాలకోడేరు, కుముదవల్లి, మార్కెట్ యార్డు మీదుగా పాలకొల్లు వైపు, భీమవరం పట్టణంలోకి, ఉండి వైపునకు వెళ్లాలి.
- భీమవరం పట్టణం నుంచి తాడేపల్లిగూడెం, తణుకు వెళ్లే వాహనదారులు బీవీ రాజు విగ్రహం వద్ద నుంచి ఉండి బైపాస్ మీదుగా మార్కెట్ యార్డు, కుముదవల్లి, పాలకోడేరు మీదుగా వెళ్లాలి.
- జువ్వలపాలెం రోడ్‌లో సర్ ఆర్థర్ కాటన్ పార్క్ వద్ద నుంచి కాళ్ళ రోడ్, పెదఅమిరం పుంతరోడ్ వరకు నో వెహికల్ జోన్‌గా ప్రకటించాం. ఉండి బైపాస్ రోడ్డులోని బీవీ రాజు విగ్రహం నుంచి గొల్లలకోడేరు విగ్రహం వరకు నో వెహికల్ జోన్‌గా ప్రకటించాం.

#### పార్కింగ్ ప్లేస్

- ఆచంట, తణుకు నియోజకవర్గాల నుంచి వచ్చే వారు విష్ణు క్యాంపస్ దగ్గరలో ఉన్న అంజన, సంజన అపార్ట్‌మెంట్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి.
- నర్సాపురం, పాలకొల్లు నియోజకవర్గాల నుంచి వచ్చే వారు కొవ్వాడ అన్నవరం రోడ్డు మీదుగా విష్ణు ప్లేగ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.
- భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల నుంచి వచ్చే వారు నాగరాజ్ మాల్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి.
- ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల నుంచి వచ్చే వారు కాళ్ళ రోడ్‌లో ఉన్న శ్రీరామ కోల్డ్ స్టోరేజీ వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. ప్రజలు ట్రాఫిక్ మళ్లింపునకు సహకరించాలని ఎస్పీ కోరారు.

## రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీగా
# నాగ నరసింహారావు బాధ్యతలు


బాధ్యతలు స్వీకరించిన నాగ నరసింహారావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 1 : రాజమహేంద్రవరం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్‌గా సీహెచ్.నాగ నరసింహారావు నియమితులయ్యారు. మునిసిపల్ ఆర్‌డీగా పనిచేసిన నాగళ్ళ వీరవెంకట సత్యనారాయణ పదవీ విరమణ కావడంతో ఆయన స్థానంలో కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావునును ఆర్‌డీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. 1999 గ్రూప్-2 బ్యాచ్‌కు చెందిన నాగ నరసింహారావు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో భీమవరం, పాలకొల్లు, కొవ్వూరు, నరసాపురం మునిసిపాలిటీలకు కమిషనర్‌గా సేవలందించారు. కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆర్‌డీ నాగనరసింహారావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీగా అంకితభావంతో సేవలందిస్తానన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల పరిధిలో 34 మునిసిపాలిటీలు తన పరిధిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా పలు మునిసిపాలిటీలకు చెందిన కమిషనర్లు, అధికారులు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

## ఈనెలాఖరు వరకు విజయవాడ వరకే గుంటూరు ఫాస్ట్

నరసాపురం, జూన్ 1: నరసాపురం-గుంటూరు మధ్య నడిచే 17282 ఫాస్ట్ ప్యాసింజర్ శనివారం పునరుద్ధరించారు. ఈ రైలు ఈనెల 30 వరకు విజయవాడ వరకు నడవనుంది. గుంటూరు డివిజన్‌లో ట్రాక్ పనులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నారు. నరసాపురంలో ఉదయం ఆరు గంటలకు బయలుదేరే రైలు తిరుగు ప్రయాణంలో విజయవాడలో సాయంత్రం 6.50 గంటలకు బయలుదేరనుంది.


భీమవరం స్పెషల్ జైల్‌ను సందర్శించిన పురుషోత్తమ కుమార్

## ముద్దాయిలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్

భీమవరం క్రైం/నరసాపురం టౌన్, జూన్ 1 : న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమతలేని ముద్దాయిలకు మండల సేవాసంస్థ తరఫున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తమ కుమార్ అన్నారు. శనివారం భీమవరం, నరసాపురం స్పెషల్ సబ్ జైళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెయిల్, ష్యూరిటీ వివరాలను సంబంధిత కోర్టు న్యాయమూర్తిని, ముద్దాయి తరుపు న్యాయవాదిని వాకబు చేస్తారు, కేసు విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం జైళ్ల పరిసరాలను, ముద్దాయి బ్యారక్‌లను, వంటశాలను, స్టోర్ రూమ్, ఆఫీస్ రూమ్‌లను పరిశీలించారు. ముద్దాయిలకు అందుతున్న భోజన వసతులు, డాక్టర్ విజిట్ విషయాలను జైలు సూపరింటెండెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, భీమవరం సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు, ఒకటో అదనపు సివిల్ జడ్జి పి.మనీషా, రెండో అదనపు సివిల్ జడ్జి డి.ధనరాజు, జైలు సూపరింటెండెంట్ డి. వెంకటగిరి, ఉచిత న్యాయవాదులు, సివిల్ జడ్జి వరలక్ష్మి, ఆదనపు సివిల్ జడ్జి శ్రీనివాస్, జైలర్ అప్పారావు, బార్ అసోసియేషన్ సభ్యులు దానయ్యనాయుడు, ఆర్‌జీ కుమార్, పద్మజా, శిరిషా, చాముండేశ్వరి, ఆనందబాబు, వరలక్ష్మి ఉన్నారు.


పతకాలు సాధించిన విద్యార్థులు

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో
# ఏలూరు విద్యార్థులకు పతకాలు

ఏలూరు స్పోర్ట్స్, జూన్ 1: మహారాష్ట్రలోని తండాలలో ఇటీవల జరిగిన కరాటే కోచింగ్ క్యాంప్, జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో ఏలూరులోని 'ఆంధ్రప్రదేశ్ కనుంజుకు షోటోకాన్ డూ ఆర్గనైజేషన్ విద్యార్థులు పతకాలు సాధించారని కోచ్ బీఎల్ నారాయణ తెలిపారు. శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జపాన్ నుంచి వచ్చిన గ్రాండ్ మాస్టర్ కోబి యమమ్మొరా ఆధ్వర్యంలో పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో తమ విద్యార్థులు పతకాలతో పాటు చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఓవరాల్ చాంపియన్ రెండోస్థానంలో నిలిచారన్నారు. కరాటే పోటీల్లో టి.జేతవ్వరెడ్డి రజత పతకం, టి.నందీశ్వరరెడ్డి బంగారు, వెండి పతకం, మోహిత్‌సత్యసాయి వెండి, కాంస్య పతకం, పి.భూపతి రెండు వెండి పతకాలు, ఎ.యశస్వి రెండు బంగారు పతకాలు, ఎం.డి.మెహర్ ఉన్నీస రజిత పతకం, బాలాజి రామచంద్ర రెండు రజత పతకాలు, ఎ.వైభవ్ బాలాజి వెండి, రజిత పతకం, ఎస్.రాజు రజిత, వేదాంత్ రెండు రజిత పతకాలు సాధించి నవంబరు 24న దుబాయ్‌లో జరిగే ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలకు వీరందరిని కమిటీ ఎంపిక చేసిందన్నారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎం.ఈ. బ్రహీంబేగ్, ఆర్గనైజేషన్ నాయకులు నాగం శివ, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటా జల్లెడ

## ఉమ్మడి పశ్చిమ జిల్లాలో తనిఖీలు ముమ్మరం

కౌంటింగ్ సందర్భంగా కార్డన్ సెర్చ్‌లు

- రికార్డులు లేని ద్విచక్రవాహనాలు స్వాధీనం
- లబోదిబోమంటున్న వాహనదారులు
- మామూళ్ల మత్తులో సిబ్బంది !
- పొలాల్లో దాచుకుంటున్న వాహనాలు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గ్రామ గ్రామాన వాహనాల తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. మరో రెండు రోజుల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉండటం, ఇటీవల జిల్లాలో దొంగతనాలు పెరగడంతో పోలీసులు తనిఖీలను అధికం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో రహదారులపై వాహనాలను ఆపి తనిఖీలు చేయడమే కాకుండా ఇంటింటా జల్లెడ పడుతున్నారు.

\- పాలకొల్లు


కైకలూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ కృష్ణకుమార్, సిబ్బంది

ఇటీవల కాలంలో ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా చిల్లర దొంగతనాలు పెరిగిపోయాయి. గత రెండు నెలల వ్యవధిలోనే ఉమ్మడి పశ్చిమ జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలో మోటారు సైకిళ్ళు, ఇళ్ల వద్ద నీటి మోటార్లను ఎత్తుకుపోయారు. రైతులు మకాంలో పెంచుకునే కోడి పెట్టలు, పుంజులను ఎత్తుకుపోతున్నారు. సాధారణంగా ప్రతీ ఏటా వేసవిలో చిల్లర దొంగతనాలు పెరుగుతాయి. ఈ ఏడాది చిల్లల దొంగలు మరింతగా రెచ్చిపోయారు. ఎన్నికలు కూడా రావడంతో ఆవారా జనం సంఖ్య మరింత పెరిగిపోయి. మద్యం వంటి వ్యసనాలకు సొమ్ములు లేక దొంగతనాలకు పాల్పడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పెద్దగా అల్లర్లు లేనప్పటికీ, పల్నాడు ఇంకా పలు ప్రాంతాల్లో రాజకీయపార్టీ శ్రేణులు అల్లర్లకు పాల్పడడంతో పోలీసులు ముందుస్తు జాగ్రత్త చర్యలకు ఉపక్రమించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలో అనుమానం ఉన్నప్రతీ ప్రాంతంలోనూ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఓ ఇంటిలో ద్విచక్రవాహనం ఉంటే సంబంధిత వాహనాల రికార్డులను పరిశీలిస్తున్నారు. సీ-బుక్, నంబర్ ప్లేట్లు లేకుంటే వాహనాలను పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు.

పోలీసులు బృందాలుగా ఏర్పడి తమ కూడా ఒక ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని ఉంచుకుంటున్నారు. స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను పోలీసు స్టేషన్లకు తరలిస్తున్నారు. అనంతరం సంబంధిత వాహనానికి యజమాని రికార్డులు చూపిస్తే వాహనాన్ని తిరిగి ఇస్తున్నారు. పెట్రో బాంబుల్లాంటివి తయారు చేయకుండా ఇప్పటికే పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్ చిల్లర విక్రయాలు నిషేధించారు. గుర్తుతెలియని ద్విచక్రవాహనాలను ఉపయోగించుకుని అసాంఘిక కార్యక్రమాలు, అల్లర్లకు పాల్పడే అవకాశాలు ఉండడంతో ముందస్తుగా వాహనాల తనిఖీలు చేపట్టారు.

### ఆందోళనలో వాహనదారులు

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు వినియోగించే వారు వాహన రికార్డులపై పెద్దగా దృష్టి సారించరు. ఏళ్ళ తరబడి బైక్‌కు ఇన్సూరెన్సు లేకున్నా రెన్యువల్ చేయించరు. అధికశాతం వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్సులు ఉండవు, ఈ పరిస్థితుల్లో పోలీసులు ఇంటింటికీ తిరిగి వాహనాలపై ఆరా తీస్తుండడంతో ద్విచక్రవాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తాము ఫలానా వ్యక్తి వద్ద వాహనం కొనుగోలుచేశామని, సీ-బుక్ ఇంకా తీసుకోలేదని కొంత మంది చెప్పినప్పటికీ ఆ వాహనానికి రికార్డులు లేకపోవడంతో పోలీసులు వాహనాలను స్టేషన్లకు తరలిస్తున్నారు.

### నాలుగో తేదీ వరకు తనిఖీలే

ఎన్నికల ఫలితాల కౌంటింగ్ ప్రక్రియ ఈనెల 4వ తేదీన ఉండటంతో మరో రెండు రోజులు తనిఖీలు ఇదేవిధంగా ఉంటాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు. తనిఖీలతో పౌరులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. రికార్డులు సరిగా చూపించలేని సందర్భంలో ఆయా వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించినప్పటికీ రికార్డులు చూపితే వెంటనే వాహనాన్ని ఇస్తున్నామని చెబుతున్నారు.

### పొలాల్లో దాచుకుంటున్న బైక్‌లు..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గత వారం రోజులుగా తనిఖీలను ముమ్మరం చేయడంతో వాహనదారులు కొంతమంది తమ బైక్‌లను కూడా పోలీసులు తీసుకు వెళతారనే భయంతో పొలాల్లో దాచుకుంటున్నారు. తగినంత అవగాహన లేకపోవడం పోలీసులు ఎంచేస్తారోనన్న భయాందోళనలతో పెద్దగా చదువుకోని వాహన దారులు ఆందోళన చెందుతున్నారు.

### సందిట్లో సడేమియా

తనిఖీల పేరుతో జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో కిందిస్థాయి సిబ్బంది మామూళ్ళు వసూళ్ళు చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనదారుడు అమాయకంగా కనిపిస్తే ఏదో ఒక కారణం చూపించి సొమ్ములు లాగుతున్నారని విమర్శలు వినిపిస్తున్నారు.

### డ్రైవింగ్ లైసెన్సులపై శ్రద్ధపెట్టాలి

పోలీసులు ఇంటింటికి తిరిగి ద్విచక్రవాహనాలకు రికార్డులు ఉన్నది లేనిది తనిఖీలు చేస్తున్నట్టుగానే సంబంధిత వాహనదారుకు డ్రైవింగ్ లైసెన్సు ఉందో లేదోనని పరిశీలించాలని పలువురు పరిశీలకులు సూచిస్తున్నారు. వాహన దారులు అందరికీ డ్రైవింగ్‌పై (లైసెన్సు) అవగాహన కల్పించి లైసెన్సులు ఇస్తే రహదారులపై ప్రమాదాలు తగ్గుతాయని, పోలీసులు రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులు దృష్టి పెట్టాలని పలువురు పరిశీలకులు సూచిస్తున్నారు.

## అల్లర్లకు పాల్పడితే జైలుకే: ఎస్పీ



ఏలూరు క్రైం, జూన్ 1 : ఎగ్జిట్ పోల్స్ పేరుతో ప్రజలు వివాదాలు, అల్లర్లకు పాల్పడితే జైలుకే అని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు ఎగ్జిట్ పోల్స్, కౌంటింగ్ దృష్ట్యా గ్రామాల్లో వివాదాలు అల్లరి లేకుండా శాంతియుతంగా ఉండాలని సూచించారు. ప్రతి రోజు జిల్లాలో పలు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తూ గ్రామాల్లో శాంతి భద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎవరైనా సమావేశాలు అనుమతి లేకుండా పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ 4న నిర్వహించనున్న దృష్ట్యా పోలీస్ యాక్ట్ 30, సీఆర్పీసీ 144 సెక్షన్ అమలులో ఉన్నాయని అన్నారు. కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించి నడుచు కోవాలని సూచించారు. ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని, గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్లర్లకు పాల్పడితే వారి సమాచారం 122కు గాని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు గాని తెలియజేయాలన్నారు.

# రెండు గంటల్లో ముగిసిన జడ్పీ సమావేశం

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రధాన అంశాలపై సమీక్ష
- నాడు-నేడు పనులను పూర్తి చేయండి : జడ్పీటీసీల వినతి
- తాగునీరు, వ్యవసాయం, సాగునీరు, విద్య అంశాలపై చర్చ


జడ్పీ సమావేశానికి హాజరైన తక్కువమంది జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, (ఇన్‌సెట్‌లో) జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరుసిటీ, జూన్ 1 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. శనివారం ఏలూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కేవలం ప్రధాన అంశాలపైనే సమీక్ష నిర్వహించారు. ఉదయం పదకొండు గంటలకు ప్రారంభమైన సమావేశం దాదాపు రెండు గంటల్లోనే ముగిసింది. జిల్లా పరిషత్‌లో మొత్తం 48 మంది జడ్పీటీసీ సభ్యులుండగా సుమారు 23 మంది సమావేశానికి హాజరయ్యారు. పలు ప్రధాన శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో వ్యవసాయం, విద్య, తాగునీరు, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖల అభివృద్ధి అంశాలపై సమీక్ష చేశారు. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమర్పించారు. జడ్పీటీసీ సభ్యులు నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, తాగునీటి సమస్యలపై చర్చించారు. సాగునీటి విడుదల, వ్యవసాయ శాఖకు సంబంధించి సార్వా సాగు ప్రణాళికను సంబంధిత అధికారులు వివరించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో ఆ శాఖకు సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులు సమగ్రంగా వివరించారు. ప్రధాన శాఖలకు చెందిన పలు సమస్యలను జడ్పీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం మీద గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సమావేశం తక్కువ సమయంలోనే ముగించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించిన పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


శ్రీవారి దర్శనానికి క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

## శ్రీవారి సన్నిధిలో భక్తుల కళకళ

ద్వారకాతిరుమల, జూన్ 1: గోవింద నామాలతో చిన్నతిరుమలేశుని క్షేత్రం మార్మోగింది. స్వామికి ఇష్టమైన రోజు కావడంతో శనివారం ఆలయానికి భక్తుల రాకతో కళకళలాడింది. ఆలయానికి దాదాపు 20 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు అంచనా. ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి మూడు గంటల పైబడి సమయం పట్టింది.

## సాహస అవార్డు నామినేషన్లకు దరఖాస్తులు

ఏలూరు కలెక్టరేట్, జూన్ 1: భారత యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ నుంచి 2023 సంవత్సరానికి జాతీయ సాహస అవార్డు కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు యువజన సర్వీసులశాఖ సెట్‌వెల్ సీఈవో ఎమ్డీహెచ్ మెహర్రాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డు కోసం నాలుగు కేటగిరీల్లో భూమిపై, నీటిపై, నావికా సంబంధమైన, వాయు విన్యాసమైన సాహసాల్లో అత్యుత్త మ విజయం సాధించిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. సాహస క్రీడల్లో అంకిత భావంతో నైపుణ్యాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద అవార్డు, ఫెన్సింగ్ నార్గే ప్రతిమ, ధ్రువపత్రం, గ్లేజర్, శారీ, రూ.15 లక్షల నగదు బహూకరిస్తారని తెలిపారు. ఒకే కేటగిరీకి సంబంధించి ఒకే వ్యక్తికి రెండో పర్యాయం ఈ అవార్డు ఇవ్వరన్నారు. ఈ అవార్డు అర్జున్‌అవార్డుకు సమానమన్నారు. అర్జున్ అవార్డు ఇచ్చే సమ యంలోనే ఇదే అవార్డు అందజేస్తామన్నారు. ఈనెల 16వ తేదీలోగా టోర్న మెంట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారానికి 94909 38012 నంబరులో సంప్రదించాలన్నారు.

## వరి విత్తనాల గొడౌన్‌పై విజిలెన్స్ దాడి

ఆచంట, జూన్ 1 : రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు శనివారం విజిలెన్స్ అధికారులు పెనుగొండ మండలం చినమల్లంలో ఉన్న ఎస్ఎస్ శ్రీధాన్యలక్ష్మి సీడ్స్‌నకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకుండా ఆచంటలో ఉన్న గొడౌన్‌లో విజిలెన్స్ అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. సుమారు 51 లక్షల 80 వేల 400 విలువ గల 2,590 క్వింటాళ్లకు ఎటువంటి అనుమతులు లేని వరి విత్తనాలు గుర్తించి యజమాని దమ్మా రవీంద్రపై కేసు నమోదు చేశామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయాధికారి పి.సురేష్, విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్ రంజిత్ కుమార్, విజిలెన్స్ ఏఈ ఎం. రూపేష్‌వర్మ, మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సత్యనారాయణ తదితరులున్నారు.

## ఆబోతుల స్వైరవిహారం

» భయాందోళనలో ప్రజలు




గణపవరం, జూన్ 1: గణపవరం శేషమహల్ సెంటర్‌లో ఆబోతులు స్వైరవిహారం చేశాయి. ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గణపవరం, భీమవరం ప్రధాన రహదారిపై స్థానిక శేషమహల్ థియేటర్ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం ఆబోతులు కుమ్ములాడుకున్నాయి. ఈ మేరకు సుమారు అరగంటపైనే రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆబోతులు నిత్యం పూల, పండ్లు, కూరగాయల దుకాణాల్లో చొరబడి తినేస్తుండడంతో నష్టపోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. గణపవరం సెంటర్‌లో బస్సుల కోసం నిలబడిన ప్రయాణికులపై కూడా దాడి చేయడంతో గాయాలపాలవుతున్నారు. ఆవులు, ఆబోతులను రహదారులపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులు, పోలీసులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## క్రైం సమాచారం

### ఉరి వేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం


పెంటపాడు, జూన్ 1 : మండలంలోని దర్శిపర్రు శివారు బిళ్ళగుంట గ్రామంలోని పొలాల్లో ఉన్న ఒక చెట్టుకు శనివారం గుర్తుతెలియని వ్యక్తి ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ శీలం శంకర్ తెలిపారు. చనిపోయిన వ్యక్తికి సుమారు40-45 మధ్య వయస్సు ఉంటుందని, లుంగీ, చొక్కా ధరించి ఉన్నాడన్నారు. ప్రస్తుతం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచామన్నారు. ఎవరైనా తెలిసిన వారంటే పెంటపాడు పోలీస్‌స్టేషన్‌లో లేదా 94407 96613 నంబరుకు సంప్రదించాలని కోరారు.

### పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ద్వారకాతిరుమల, జూన్ 1 : తీవ్ర అనారోగ్యానికి గురైన ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన తిమ్మాపురంలో జరిగింది. వివరాలివి.. గ్రామానికి చెందిన యడ్లపల్లి సతీష్(30) నల్లజర్ల మండలం చోడవరంలోని అత్తారింట్లో ఉంటున్నాడు. జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న అతడు గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గత నెల 30వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పని ముగించుకుని తన తండ్రిని చూసేందుకు వెళ్తున్నానని చెప్పి తిమ్మాపురం వచ్చాడు. 31న పురుగుల మందు తాగి గ్రామంలోని పొలం గట్టుపై పడి ఉన్నాడు. స్థానికులు, బంధువులు అతడిని వైద్యం కోసం భీమడోలు ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

### లారీని ఢీకొట్టిన ఆటో

» ఒకరి మృతి.. ఐదుగురికి గాయాలు


జీలుగుమిల్లిలో హైవేపై లారీ ఢీకొన్న ఆటో

జీలుగుమిల్లి, జూన్ 1 : జీలుగుమిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం నుంచి అశ్వారావుపేట వైపు జాతీయ రహదారిపై వెళుతున్న ప్యాసింజర్ ఆటో ప్రమాదవశాత్తు విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో డి.రాంబాబు (60) తీవ్ర గాయాలు పాలయ్యాడు, మిగిలిన ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా వారిని తెలంగాణ రాష్ట్రం ఖమ్మం ఆస్పత్రికి తరలి స్తుండగా రాంబాబు మార్గ మధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వి.చంద్రశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### మృతుడి ఆచూకీ లభ్యం

ఏలూరు క్రైం, జూన్ 1 : మృతుడి ఆచూకీ లభ్యమైంది. శుక్రవారం నగర శివారు ఆశ్రం ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారి పక్కన పడి ఉన్న మృతి చెందిన వ్యక్తిని సిద్ధార్థ(30)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సిద్ధార్థ కొంతకాలంగా రాజమహేంద్రవరంలో ఉంటూ ఓ బేకరీలో పనిచేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. రెండు రోజుల క్రితం ఇంటికి వెళతానని బేకరీ నిర్వాహకులకు చెప్పి కర్ణాటకకు బయలుదేరిన వ్యక్తి ఆశ్రం ఆసుపత్రి సమీపంలో మృతి చెందాడు. ఏదైనా అనారోగ్యానికి గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. రూరల్ ఎస్ఐ రాజారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రేచీకటితో స్కూటర్ నడిపిన వ్యక్తి

» ఎదురుగా వస్తున్న దంపతుల బైక్‌కు ఢీ

» భార్య మృతి.. భర్తకు, ఢీకొన్న వ్యక్తికి గాయాలు


మృతి చెందిన సత్యవతి, గాయాలైన అంజియ్య, రాము

ఏలూరు క్రైం, జూన్ 1 : షాపింగ్ చేసుకుని మోటారు సైకిల్‌పై వెళ్తున్న దంపతులను ఎదురుగా స్కూటర్‌పై వస్తున్న ఓ వ్యక్తి అతివేగంగా ఢీ కొనడంతో బైక్‌పై వెనుక కూర్చున్న భార్య మరణించగా, భర్త తీవ్ర గాయాల పాలయ్యాడు. ఢీ కొన్ని వ్యక్తి కూడా తీవ్ర గాయాల పాలయ్యాడు. దెందులూరు మండలం శ్రీరామవరానికి చెందిన యర్రా అంజియ్య(33), అతడి భార్య సత్యవతికి (32)కు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆశ్రం ఆసుపత్రిలో గార్డెనింగ్ పనుల నిమిత్తం రోజు వారీ కూలీలుగా పనిచేస్తున్నారు. వారి కుమారుడు కూడా అక్కడే పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం పనులు ముగించుకుని అంజియ్య అతడి భార్యతో కలిసి మోటారు సైకిల్‌పై ఏలూరు షాపింగ్‌కు వెళ్లి తిరిగి రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తుండగా ఏలూరులోని గూడ్స్‌షెడ్ రోడ్డు వద్ద ఎదురుగా స్కూటర్‌పై ఏలూరు జెనర్టీపేటనకు చెందిన పోలాసి రాము వేగంగా వచ్చి ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలకు గురై కొట్టుమిట్టాడుతుండగా సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ ప్రభాకర్ సిబ్బందితో వెళ్ళి క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి అత్యవసర విభాగపు వైద్యులు పరీక్షించి సత్యవతి మృతి చెందిందని నిర్ధారించారు. అంజియ్య, రాము తీవ్ర గాయాల పాలయ్యారు. రాము ఆటోనగర్‌లో లారీ కమాన్ ప్లేట్ల వర్క్ చేస్తాడని అతడికి రేచీకటి ఉందని.. చీకటిపడితే కళ్లు కనిపించవని ప్రతి రోజు చీకటి పడకుండానే ఇంటికి చేరుకుంటాడని, అక్కడ పని ఉండడం వల్ల ఆలస్యంగా బయలుదేరాడని కళ్లు కనపడకపోవడం వల్ల ప్రమాదం జరిగినట్లుగా గుర్తించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

### గోదావరిలో దూకి తాగుబోతు హల్‌చల్

» గంటన్నర పాటు ఉత్కంఠ.. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్

పోలవరం, జూన్ 1 : పట్టిసీమ ఫెర్రీ రేవులో శనివారం రాత్రి ఒక తాగుబోతు గోదావరిలో స్నానానికి దిగి గల్లంతయినట్టు నటించి హల్‌చల్ చేశాడు. ఆ వ్యక్తి చనిపోయాడా, కొట్టుకుపోయాడా అని దాదాపు గంటన్నరపాటు ఉత్కంఠ పరిస్థితి నెలకొంది. వివరాలివి.. కొయ్యలగూడెంకు చెందిన ఎడ్లబండి నడిపే యువకుడు ఇంటి వద్ద గొడవపడి తాపీపని చేసే మరో స్నేహితుడితో కలిసి కొత్తపట్టిసీమలో ఉన్న బావ ఇంటికి వెళ్లి వస్తూ రాత్రి తొమ్మిది గంటలకు మద్యం తాగారు. సదరు యువకుడు పట్టిసీమ ఫెర్రీ రేవులో స్నానానికి దిగి కనిపించకుండా పోవడంతో వెంట వచ్చిన స్నేహితుడు భయాందోళనకు గురయ్యాడు. గమనించిన స్థానిక యువకులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ పవన్‌కుమార్, నలుగురు పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గల్లంతయ్యాడనుకునే వ్యక్తి మరో రేవు నుంచి ఫెర్రీరేవుకి చేరుకోవడంతో అక్కడి జనం ఊపిరిపీల్చుకున్నారు. సదరు యువకుడితో పాటు స్నేహితుడికి ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించి అతడిని బంధువులకు అప్పగించారు.

## ఎన్నికల నిబంధనలు తుంగలోకి..

» బాటిళ్లు, ప్లాస్టిక్ డబ్బాలలో పెట్రో, డీజిల్ అమ్మకాలు


ద్వారకాతిరుమల పెట్రోల్ బంక్‌లో..

ద్వారకాతిరుమల, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు వరకు వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ పోయాలన్న ఎన్నికల సంఘ నిబంధనలను స్థానిక పెట్రోల్ బంక్ యజమానులు తుంగలోకి తొక్కుతున్నారు. ద్వారకాతిరుమలలోని పలు పెట్రోలు బంక్‌లలో పెట్రోల్, డీజిల్ విక్రయాలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జరుపుతున్నారు. తమ స్వలాభం కోసం బాటిళ్లు, ప్లాస్టిక్ డబ్బాలలో నింపుతూ విక్రయాలు జరుపుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పెట్రో అమ్మకాలు యథావిధిగా జరుగుతున్నాయి. ఇదేమిటని ప్రశ్నిస్తే బంక్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## గంగానమ్మ, మద్దిరావమ్మలకు కుంకుమ పూజలు



ఆకివీడు, జూన్ 1: గంగానమ్మ-మద్దిరావమ్మ-పోతురాజు ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. దేవాలయ అధ్యక్షుడు చుండూరి సత్యనారాయణ-వెంకట లక్ష్మి కళావతి, రామకృష్ణ-రమణి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి, కుంభనైవేద్యానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖండ అన్నసమారాధన, గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో దేవాలయం నిర్వాహకులు మోటుపల్లి సత్యనారాయణ, మోటుపల్లి నరసింహరావు, మోటుపల్లి సుబ్బారాయుడు, నగర పంచాయతి చైర్మన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ పుప్పాల పండు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, డీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

## పింఛన్‌దారుల పాట్లు



ఆకివీడులో బ్యాంకు వద్ద పింఛన్‌దారులు

ఆకివీడు, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల పుణ్యమా అంటూ పింఛన్‌దారులకు ఒకటవ తేదీ గుదిబండలా మారింది. లబ్ధిదారులకు నగదు బ్యాంకులో జమచేశామని, బ్యాంకులో అకౌంట్లు లేనివారి ఇళ్లకు సచివాలయ సిబ్బంది వెళ్లి ఇవ్వడం జరుగుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. బ్యాంకులకు వెళితే బ్యాంకు సిబ్బంది తమ అకౌంట్లలో నగదు పడలేదంటుండడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. గత నెలలో కూడా పింఛను తీసుకోలేదని, బ్యాంకులకు వెళితే సిబ్బంది తమ అకౌంటులో బ్యాలెన్స్ లేకపోవడంతో మీకు డబ్బులురావని, ఆధార్ నమోదవ్వలేదని తెలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు మానుకొని కిలో మీటర్ల మేర ఆటోలకు డబ్బులు పెట్టుకొని వస్తే బ్యాంకు సిబ్బంది సమాధానం సక్రమంగా లేదంటున్నారు. కొంతమంది బ్యాంకులో వేస్తున్నారు కదా తరువాతనైనా తీసుకోవచ్చునని బ్యాంకులకు రావడం మానేశారు.

## డీఎన్నార్ ప్రిన్సిపాల్ శాంతకుమారి ఉద్యోగ విరమణ



డాక్టర్ శాంతకుమారిని సత్కరిస్తున్న కళాశాల పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 1 : డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ డా.బిఎస్ శాంత కుమారి ఉద్యోగ విరమణ చేశారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాలకవర్గ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), పాలకవర్గ ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు తదితరులు శాంతకుమారిని ఘనంగా సత్కరించారు.

## పాలకోడేరులో వేసవి విజ్ఞాన తరగతులు

పాలకోడేరు, జూన్ 1: పాలకోడేరులోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు మేధాశక్తిని పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందని గ్రంథాలయ అధికారి బాలరాజు అన్నారు. శనివారం విద్యార్థులకు చెస్‌లో మెళకువలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందించామని అన్నారు.

## పింఛన్ పంపిణీ



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఎంపీడీవో బాబ్జిరాజు

మొగల్తూరు, జూన్ 1: ఎన్నికల కోడ్ కొనసాగుతుండటంతో జూన్ నెల పింఛన్‌లు కూడా ఇంటి వద్ద, బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మొగల్తూరు మండలంలో 17 గ్రామాలకు సంబంధించి 3265 మంది లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్‌లు ఇవ్వాల్సి ఉండగా శనివారం సాయంత్రానికి సుమారు 1725 మందికి అందించామని ఎంపీడీవో వి.బాబ్జిరాజు తెలిపారు. అలాగే బ్యాంకు ఖాతాల్లో 7534 మంది లబ్ధిదారులకు జమచేయాల్సి ఉందని అయితే బ్యాంకుల నుంచి పూర్తి స్థాయిలో సమాచారం అందలేదని ఎంపీడీవో తెలిపారు. మండలంలోని కొత్తపాలెం, శేరేపాలెం గ్రామాల్లో పింఛన్‌ల పంపిణీని పర్యవేక్షించి స్వయంగా వృద్ధులకు పింఛన్ అందించారు.

## మధ్యాహ్న భోజన పథకంపై శిక్షణ



భోజన పథకం కార్మికులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు

ఆచంట, జూన్ 1: ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం కుక్ కమ్ హెల్పర్‌లకు భోజన పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు ఎ.ఉషారాణి, పి.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూను సక్రమంగా అమలు చేయాలని వేడిగా, రుచిగా పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎండీఎం వీడియోలు చూపించి ప్రతీ వంటను ఎలా చేయాలో వివరిస్తూ శిక్షణ నిర్వహించారు. అనంతరం ఎండీఎం, కుక్ కమ్ హెల్పర్‌లకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

## సిబ్బంది, ఏజెంట్లకు గుర్తింపు కార్డులు: ఆర్వో



ఆచంట, జూన్ 1: ఈనెల 4వ తేదీన జరిగే కౌంటింగ్ పక్రియ నిమిత్తం కౌంటింగ్ హాలులో విధులు నిర్వహించే కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. స్వామి నాయుడు తెలిపారు. కౌంటింగ్ సందర్భంలో గోప్యత పాటించడం, జవాబు దారి తనం కలిగి ఉండాలని ఓట్ల లెక్కింపు ప్రారంభానికి ముందు ఆర్‌పీ సెక్షన్ 128లోని నిబంధనలు చదివి వివరిస్తామన్నారు. కౌంటింగ్‌కు వచ్చేవారు విధుల్లో ఉన్న పోలీసులు, రెవెన్యూ అధికారులకు తగిన గుర్తింపు కార్డులు చూపించిన తరువాత మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించడం జరగదని తెలిపారు. పార్కింగ్ స్థలం నుంచి విష్ణు కళాశాల గేటు వరకు బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బ్యాలెట్ వరుస క్రమంలోనే ఏజెంట్లు కూర్చుకోవడానికి తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

## మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి

పాలకొల్లు అర్బన్, జూన్ 1 : బడి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో అందజేసే ఆహారం రుచిగా, శుభ్రంగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి ఆర్‌ఎన్‌విఎస్‌జి శర్మ (2) అన్నారు. లంకలకోడేరు జడ్పీహైస్కూల్లో శనివారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఒకరోజు శిక్షణ తరగతుల్లో ఎంఈవో పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా పీపీటీలను వీడియోల ద్వారా ప్రదర్శనగా చూపించారు. గోరుముద్ద పథకంకు సంబంధించిన వంటల పోటీలను నిర్వహించి పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ అమ్మాజీ, మండల విద్యాశాఖ కో ఆర్డినేటర్ తోకట జనార్దన్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 1: ఎన్నికల నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి చెన్నయ్య హెచ్చరించారు. తాడేపల్లిగూడెం మాగంటి కల్యాణ మండపంలో శనివారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎస్పీ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 6 వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. డీఎస్పీ మూర్తి, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సైలు పాల్గొన్నారు.



మొగల్తూరు, కొడమంచిలి, పెన్నాడలలో ఆంజనేయ స్వామికి అలంకరణ.. భీమవరంలో అభిషేకం.. తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి పూజలు

# జై హనుమాన్

### వైభవంగా ఆంజనేయ స్వామి కల్యాణం

### రామాలయాలకు భక్తుల తాకిడి



ఇలపకుర్రులో అభయ ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామానాయుడు



జిన్నూరులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఆకివీడు, జూన్ 1: రామభక్త హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. రామాలయాలు, ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఆనాల మంచి నీటి చెరువు గట్టునున్న భక్తాంజనేయ దేవాలయంలో శనివారం సువర్చలా సమేత హనుమద్ కల్యాణం నిర్వహించారు. అఖండ అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

**పాలకోడేరు:** పెన్నాడ, గొల్లలకోడేరు, పాలకోడేరు తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పెన్నాడ గ్రామంలో భక్తాంజనేయస్వామికి 130 గ్రాముల వెండి తమలపాకులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లలకోడేరులో లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. పెన్నాడ గ్రామానికి చెందిన ఆదాడ వేణుగోపాల్ దంపతులు 130గ్రాముల వెండి తమలపాకుల దండను స్వామి వారికి బహూకరించారు.

**పాలకొల్లు అర్బన్:** యడ్ల బజారులోని పంచముఖాంజనేయస్వామి ఆలయంలో భక్తుల గోత్రనామాలతో సహస్రనామార్చనలు నిర్వహించారు. కెనాల్ రోడ్డులోని దాసాంజనేయ స్వామిని చత్రపతి శివాజీ మహరాజ్‌గా అలంకరించి పూజలు చేశారు. అనేక ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణలు చేసి, స్వామివారికి పంచామృతాభిషేకాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు గావించారు.

**మొగల్తూరు:** మొగల్తూరులోని పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం, తమలపాకులు, సిధూరంతో పూజలు నిర్వహించారు. అనంతరం అరటిపండ్లతో అభిషేకాలు నిర్వహించారు. పేరుపాలెంలోని 54 అడుగుల అభయాంజనేయస్వామి, ముత్యాలపల్లిలోని 36 అడుగులు, కాళీపట్నంలో 24 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయాలతో పాటు శేరేపాలెం, రామన్నపాలెం, కొత్తపాలెం, మొగల్తూరు లాంచీల రేవు వద్ద స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మొగల్తూరుతో పాటు పలు ఆలయాల్లో పూజల అనంతరం అన్న సమారాధనలు నిర్వహించారు.

**నరసాపురం రూరల్:** పట్టణంలోని మొగల్తూరు రోడ్‌లో కొలువైన ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. మండలంలోని వైఎస్‌పాలెం, సీతారాంపురం, చిట్టవరం, కొప్పర్రు గ్రామాల్లో అంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వైఎస్‌పాలెం గ్రామంలోని ఆలయం వద్ద ఆంజనేయస్వామికి ఆభిషేకం చేసి తమలపాకులతో ఆర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

**ఆచంట:** హనుమాన్ జయంతిని మండలంలో ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున నిర్వహించారు. పలు ఆలయాలు వద్ద అన్నసమారాధనలు కూడా నిర్వహించి పలు చోట్ల పానకం భక్తులు అందజేశారు.

**పోడూరు:** జిన్నూరు శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామికి లక్ష తమలపాకుల పూజ, గంధసింధూరం పూజలు నిర్వహించారు. సుందరకాండ పారాయణం, బాలబాలికలతో హనుమాన్ చాలీసా పఠనం చేయించారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపాన్ని అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణ, మేళతాళాలతో గ్రామానికి చెందిన డీటీడీసీ బాబు దంపతుల చేతుల మీదుగా సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణంలో 275 మంది దంపతులు పాల్గొన్నారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

**పెంటపాడు:** తాళ్లముదునూరుపాడులో సామూహిక హనుమద్ వ్రతాలు నిర్వహించారు. బైరాగిమఠం గోపాలస్వామి అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంపురం అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఘనంగా పూజలు జరిగాయి. పలు చోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు.

**భీమవరం టౌన్:** గునుపూడి పంచారామక్షేత్రమైన శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో ఉపాలయంగా ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. లక్ష తమలపాకుల పూజ, సింధూరార్చన, విశేష పుష్పాలంకరణ, సాయంత్రం శ్రీరామ ఆంజనేయ మూలమంత్ర హోమములు, నీరాజనం మంత్రపుష్పలతో కార్యక్రమాన్ని పరిసమాప్తి చేశారు. మారుతీ టాకీస్ సెంటర్‌లోని శ్రీదాసాంజనేయ స్వామివారికి 108 కలశాల పాలతో అభిషేకాలను నిర్వహించారు. తమలపాకులు, అరటిపండ్లు, వివిధ రకాల పుష్పాలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఎమ్మెల్యే గ్రంధిశ్రీనివాస్ దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

**గణపవరం:** గణపవరంలోని సువర్చల సమేత ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవారికి పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేసి అర్చకులు కైతేపల్లి శ్రీనివాస్, రాంబాబు బృందం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ చైర్మన్ వంకాయల రామారావు దంపతులచే కల్యాణ వేడుకలు నిర్వహించారు. జల్లికొమ్మరలో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను సర్పంచ్ కురేళ్ళ వెంకటరత్నం పర్యవేక్షించారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** పట్టణంలోని కోతి బొమ్మ వద్ద గల హనుమంతుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పట్టణంలో పలు ఆలయాలను కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ సం దర్శించి పూజలు చేశారు. మండలంలోని ఆరుగొల నులో భక్తాంజనేయస్వామికి నూకల ధనకృష్ణ, నూకల బుల్లియ్య దంపతులు పూజలు నిర్వహించారు.

**అత్తిలి:** అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అత్తిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గల పంచముఖ ఆంజనేయస్వామి, అత్తిలి రామన్నపేటలో గల అభయాంజనేయస్వామి, గుమ్మంపాడులో గల వరాహలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో గల ఆంజనేయస్వామికి తమలపాకులతో అర్చనలు చేశారు.

**యలమంచిలి:** ఇలపకుర్రులోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి గంధసింధూరం పూజ, తమలపాకుల పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అభయ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఉండి:** రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో టీడీపీ అధికారంలోకి రావాలని స్వామివారికి పూజలు చేసినట్లు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు అన్నారు. శనివారం వెలివర్రు గురువులోని శ్రీభక్తాఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

## ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా ఉండాలి: కలెక్టర్



ఎస్‌ఆర్‌కేఆర్ కౌంటింగ్ సెంటర్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ ప్రవీణ్

భీమవరం టౌన్,జూన్ 1 : ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలను శనివారం పరిశీలించారు. తొలుత విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని, మీడియా సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉండి నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు లోపలికి వెళ్లే మార్గాలకు సూచిక బోర్డులు స్పష్టంగా ఉండేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అఫీషియల్ కమ్యూనికేషన్, పబ్లిక్ కమ్యూనికేషన్, మీడియా సెంటర్ లను ఏర్పాటు చేశామన్నారు.

## చల్లబడ్డ వాతావరణం



నరసాపురంలో గోదావరిపై కారు మబ్బులు

నరసాపురం రూరల్, జూన్ 1: తీర ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తుఫాన్ తరువాత ఉక్కపోతతో తల్లడిల్లిపోతున్న ప్రజలకు శనివారం ఊరట లభించింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి గాలితో పాటు భారీ వర్షాలు పడ్డాయి. మండలంలోని గొంది గ్రామంలో గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. ట్రాన్స్‌కో సిబ్బంది విరిగిన లైన్లను బాగు చేసే పనిలో పడ్డారు. ఇటు పలు చోట్ల మామిడితోటలకు తీవ్ర నష్టం వాట్లింది. గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచింది. ఈ ప్రభావంతో శనివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై కనిపించింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. గోదావరి నదిపై కారుమబ్బులు కమ్ముకున్నాయి

**ఆచంట:** గత కొన్ని రోజులుగా రోహిణి కార్తె ప్రభావంతో ఎండలు మండిపోతున్న తరుణంలో శనివారం వేకువజామున ఒక్కసారిగా వాతావరణం మబ్బులు, మేఘాలతో ఏర్పడి ఈదురు గాలులు కూడా పెద్ద ఎత్తున వీచాయి. తరువాత కొంత సేపు వర్షం కూడా కురిసింది. దీంతో ఎండ దెబ్బకు అల్లాడిపోతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అయితే మరలా మధ్యాహ్నం నుంచి వాతావరణం పొడిగా ఉండి మరలా వేడి గాలులు ఉక్కబోత కూడా తోడు కావడంతో మధ్యాహ్నం నుంచి ప్రజలు ఉక్కబోతతో అలసిపోయారు.

**పాలకొల్లు అర్బన్:** వరుణుడు కరుణించడంతో శనివారం ఉదయం ఓ మాదిరి వర్షం కురిసింది. ఎండ వేడిమి కూడా తగ్గడంతో వాతావరణం చల్లబడింది. ప్రజలతో పాటు పశుపక్షాదులు కూడా చల్లని వాతావరణం వల్ల సేద తీరుతున్నారు.

## కూటమి అభ్యర్థులు గెలవాలని ప్రార్థనలు

ఆకివీడు, జూన్ 1: కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందాలని శనివారం స్థానిక మాజీ ఎంపీటీసీ ఆరీఫ్ నివాసంలో టీడీపీ శ్రేణులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చంద్రబాబునాయుడు నాల్గోవసారి సీఎంగా ప్రమాణం చేయాలని, జనసేన అధినేత పవన్ కల్యాణ్, నారా లోకేశ్ భారీ మెజార్టీతో గెలుపొందాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, ముస్లీం మైనార్టీ రాష్ట్ర నాయకుడు జాకీర్,జిల్లా నేత అబ్జల్, షరీఫ్ , మోపిదేవి శ్రీను, బచ్చు కృష్ణ, రామరాజు, సురేష్ ఉన్నారు.

## అగస్తేశ్వరస్వామి కల్యాణం

ఆకివీడు, జూన్ 1: ఆకివీడు వాడపల్లివీధిలో ఉన్న అగస్తేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో వాడపల్లి బ్రదర్స్ భక్తులు తది తరులు పాల్గొన్నారు.

## అన్నసమారాధన

కాళ్ల(ఉండి), జూన్ 1: కాళ్ళకూరు వేంకటేశ్వర స్వామి ఆలయంల వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి స్వామివారి ఆలయం వెనుక తోటలో నిర్వహించారు. శ్రీవారి వార్షిక తిరు కళ్యాణ మహోత్సవాలు ముగింపు పురస్కరించుకుని అన్నసమారాధన నిర్వహించారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

ఆకివీడు, జూన్ 1: శాంతిభద్రతలకు ఎవరైన విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని సీఐ కెవీవీఎస్ సత్యనారాయణ, ఎస్ఐ బత్తిన నాగబాబు హెచ్చరించారు. శనివారం మాదివాడలో శాంతిభద్రతలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికలు అనంతరం రాష్ట్రంలో అల్లర్లు జరుగుతు న్నందున అనుమానితులు, నేరస్థులకు సహాయ సహకారాలు అందిస్తే మీరు కూడా ఇబ్బందులు పడతారన్నారు. ఈ నెల 4న ఫలితాలు అనంతరం ఎటువంటి గొడవలకు పాల్పడరాదని, ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు లేవని, 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు.

## టీడీపీ నాయకులకు పితాని పరామర్శ

పెనుమంట్ర, జూన్ 1: జుత్తిగ గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరవల్లి సత్యనారాయణ తల్లి మహాలక్ష్మి గురువారం మధ్యాహ్నం ఇంటి వద్ద కన్నుమూశారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ వీరవల్లి సోదరుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహాలక్ష్మి చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ, నల్లమిల్లి నర్సిరెడ్డి, నీటి సంఘం మాజీ చైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి, గొలుగూరి శ్రీనివాస్ రెడ్డి, కొవ్వూరి సోమ భాస్కర్ రెడ్డి, గుడిమెట్ల సుందర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

## గన్నవరంలో రఘురామకు స్వాగతం

ఉండి, జూన్ 1: హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి విచ్చేసిన ఉండి టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజుకు స్వాగతం లభించింది. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, సీనియర్ నాయకుడు కొత్తపల్లి నాగరాజు, పెదపుల్లేరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు నడింపల్లి సత్యనారాయణరాజు, వెలివర్రు గ్రామ మాజీ ఉపసర్పంచ్ ముదునూరి రంగరాజు తదతరులు రఘురామకృష్ణరాజుకు స్వాగతం పలికిన వారిలో వున్నారు. వీరితో పాటు పలువురు పార్టీ నాయకులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## శాంతి, సహనం సమాజ ప్రగతికి మార్గదర్శకం

భీమవరం టౌన్, జూన్ 1 :శాంతి సహనం అహింస గుణాలు సమాజ ప్రగతికి మార్గ దర్శకులని, శాంతి పథంలో జీవితం పరమార్థమని, జరుగుతున్న పరిణామాలలో శాంతి సామరస్యాలు ఎంతైనా అవసరమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. స్వీప్ యాక్టివిటీస్‌లో భాగంగా కౌంటింగ్ రోజున శాంతి సామరస్యాలతో మెలగాలనే నినాదంతో ప్రచార భేరి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో ఎన్నికలు సహజమని, ఓటు వజ్రాయుధమని, కౌంటింగ్‌లో ప్రతిఒక్కరూ సమన్వయం పాటించాలని అన్నారు. స్వీప్ యాక్టివిటీస్ ప్రజల్లో అవగాహన కల్పించేలా ఇటువంటి ప్రచార భేరి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని అన్నారు. యాక్టివిటీస్ జిల్లా బ్రాండ్ అంబాసిడర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ స్వీప్ ఎన్నికల అధికారులకు పోలీస్ అధికారులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లయిన్స్‌క్లబ్ నాయకులు కంతేటి వెంకటరాజు, నందమూరి రాజేష్, బాబాజీ సాహెబ్ పాల్గొన్నారు.



చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేసిన సర్పంచ్ సూర్యకళ, డాన్స్ టీచర్ చూడామణి

## సంప్రదాయాలపై అవగాహన ఉండాలి

పెంటపాడు, జూన్ 1: చిన్నారులంతా భారతీయ సంస్కృతి సంప్రదాయల పట్ల అవగాహన కల్గి ఉండాలని సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ అన్నారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా పెంటపాడులో డాన్స్ టీచర్ చూడామణి ఆధ్వర్యంలో కూచిపూడిలో శిక్షణ తీసుకున్న విద్యార్థులకు శనివారం ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం లాంటి కళల్లో విద్యార్థులు చిన్ననాటి నుంచే శిక్షణ పొందాలన్నారు.

## కార్యదర్శి రామకృష్ణ సేవలు భేష్

పెంటపాడు, జూన్ 1: కార్యదర్శిగా శీలం రామకృష్ణ సేవలు అభినందనీయమని అంబేద్కర్ కోనసీమ జిల్లా డ్వామా అసిస్టెంట్ పీడీ జీవీకే మల్లికార్జునరావు కొనియాడారు. ముదునూరు కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న రామకృష్ణకు అభినందన కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీహెచ్ బాలాజీ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. పీఆర్ డీఈ వేణుగోపాలరావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఎంఈవో రామకృష్ణ, జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పగడం నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు డి. నాగదేవి, మండల ఉపాధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

## ఎక్స్‌రే మిషన్ ప్రారంభం

తణుకు, జూన్ 1: తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి అందిన ఎక్స్‌రే మిషన్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ శనివారం ప్రారంభించారు. అత్యాధునిక పరికరాల ద్వారా రోగులకు సత్వర సేవల అందించే వీలు కలుగుతుందన్నారు. సిబ్బంది వైవీఎస్‌బీ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం

తణుకు, జూన్ 1: జైలులో ఉన్న ముద్దాయిల ఆర్థిక పరిస్థితి బావుండక న్యాయవాదిని నియమించుకోలేకపోతే వారికి న్యాయ సేవల సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి రత్న ప్రసాదు అన్నారు. శనివారం తణుకు సబ్ జైలును తనిఖీ చేసి ముద్దాయిల కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి

పెంటపాడు, జూన్ 1: రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ పశుసంవర్థక శాఖ ఏడీఏ డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం దర్శిపర్రులో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 పశువులకు గొంతువాపు నివారణ టీకాలు వేసి, 60 మందికి ఉచితంగా మినరల్ మిక్చర్ , కాల్షియం అరుకులను అందజేసినట్లు పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ మహేష్ తెలిపారు.

## అచ్చెన్ననను కలసిన వలవల బాబ్జి



తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 1: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి శనివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థి గెలుపుకోసం కూటమి నాయకులంతా కష్టపడి పనిచేశారని కితాబిచ్చారు. అనంతరం అచ్చెన్నాయుడిని బాబ్జి సత్కరించారు.

## వృద్ధులకు నగదు, పండ్లు అందజేత

ఉండి, జూన్ 1: వృద్ధులకు చేయూతను అందించడమే తన ధ్యేయమని తెలుగుదేశం పార్టీ నాయకుడు తోట రాము అన్నారు. శనివారం పాములపర్రులోని తన నివాసం వద్ద గ్రామంలోని 80మంది వృద్ధులకు ప్రతి నెల రూ.100 నగదు, ఫ్రూట్స్ అందిస్తున్నట్లు రాము తెలిపారు.

## ఆలోచింపజేస్తున్న సాంఘిక నాటకాలు

భీమవరం అర్బన్, జూన్ 1 : ఒక వైపు హాస్యం. మరోవైపు ఆలోచింపచేసి విధంగా నాటికల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. భీమవరం డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో చైతన్య భారతి 17వ జాతీయస్థాయి సాంఘిక నాటికల పోటీలు మూడో రోజు ఆలోచింపచేశాయి. అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్ర ప్రస్థం, తెలుగు కళాసమితి విశాఖపట్నం వారి నిశ్శబ్దామా ! నీ ఖరీదెంత, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి కౌసల్యా సుప్రజ రామా వంటి నాటికలు ఆకట్టుకున్నాయి.

## పోలీసుల రిహార్సల్స్

భీమవరం క్రైం, జూన్ 1 : కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని విధాల పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. ఈనెల 4వ తేదీన కౌటింగ్ నేపథ్యంలో జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో డ్రై రిహార్సల్స్ శనివారం నాడు నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారులు, ఇతర అనుబంధ శాఖల అధికారులతో కలిసి ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత, గార్డ్‌లను జిల్లా ఎస్పీ పరిశీలించారు. కౌటింగ్ సిబ్బంది, రాజకీయ నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లును క్షుణ్ణంగా తనిఖీ చేయడం, ప్రవేశ ద్వారం నుంచి వీరిని కౌంటింగ్ కేంద్రాలకు తరలింపు వంటి వాటిపై వాస్తవ పరిస్థితిని గమనించి లోటుపాట్లను అధిగమించడానికై ఈ డ్రై రిహార్సల్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ పలు సూచనలు చెయ్యడం జరిగింది. ఏవైతే లోటుపాట్లు గమనించడం జరిగిందో, ఆయా అంశాలపై నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించి ఒక స్పష్టమైన అవగాహనకు రావడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్పీ డా.అజిత వేజెండ్లతో పాటు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, అదనపు ఎస్పీ మాసుమ్ బాషా, జిల్లా ఆర్మ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, రైల్వే డీఎస్పీ నాగేశ్వరరావు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

నరసాపురం టౌన్, జూన్ 1: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించారు. దానిలో భాగంగా విద్యార్థులకు నీతి కథలు, చిత్రలేఖనం, క్విజ్, పాటలు, డ్యాన్స్ వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరీ అధికారి కుమారి, సుధీర్, సూర్యంబాబు పాల్గొన్నారు.



సమావేశమైన యూనియన్ నాయకులు

## మెకానిక్‌ల సంక్షేమానికి సమష్టి కృషి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 1: మోటారు సైకిల్ మెకానిక్‌ల సంక్షేమానికి సమష్టిగా కృషి చేద్దామని యూనియన్ ఉపాధ్యక్షుడు నల్లా మోహనరావు పేర్కొన్నారు. శనివారం కుంచనపల్లిలో మోటారు సైకిల్ మెకానిక్‌ల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనియన్ కోసం కొనుగోలు చేసిన స్థలంలో భవన నిర్మాణం కోసం సభ్యులంతా సహకరిస్తే నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. యూనియన్ అధ్యక్షుడు చిన్నం చినవెంకట రెడ్డి, గౌరవ అధ్యక్షులు పసుపులేటి సత్యనారాయణ, కొమ్మిశెట్టి వెంకరాజు, కార్యదర్శి సోము శ్రీను, కోశాధికారి పొన్నాడ సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కెల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు తనిఖీలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 1: ఎగ్జిట్ పోల్స్ విడుదలైన సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పట్టణంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రిజర్వు పోలీసులతో ముఖ్య కూడళ్లలో బందోబస్తు ఏర్పాటుచేయడంతోపాటు వాహనాల తనిఖీలు చేపట్టారు.